క్లుప్తంగా

మల్లూరులో సీపీ దంపతుల పూజలు



హేమాచల లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుంటున్న సీపీ దంపతులు

మంగపేట: ములుగు జిల్లా మంగపేట మండల పరిధిలోని మల్లూరు హేమాచల లక్ష్మీ నర్సింహస్వామిని కుటుంబ సభ్యులతో కలిసి వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ దంపతులు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ కార్యనిర్వహణ అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు కైంకర్యం రాఘవాచార్యులు మంగళవాయిద్యాలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి విశిష్టత, ఆలయ పురాణాన్ని సీపీకి వివరించి స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు.

'ఎస్సార్'లో రక్తదాన శిబిరం



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం అన్నాసాగరం క్రాస్‌లోని ఎస్సార్ యూనివర్సిటీలో యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జీఆర్‌సీ.రెడ్డి మాట్లాడుతూ రక్తదానం.. ప్రాణదానం కంటే గొప్పదని పేర్కొన్నారు. ఈమేరకు 350 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ పాలకవర్గ సభ్యుడు ఈవి.శ్రీనివాస్, లయన్స్ క్లబ్ హనుమకొండ అధ్యక్షుడు రాంరెడ్డి, ఎస్సార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ గురురావు, డీన్ అర్చనారెడ్డి, సుబేదార్ మేజర్ చంద్రశేఖర్, హవల్దార్ బాహుబలి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన కార్మికుల ఆందోళన

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలోని 300టీసీఎస్ పద్దు కింద 16మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం రెండవ రోజు కార్మికులు ఆందోళన కొనసాగించారు. నూతన కాంట్రాక్టు విధానం ద్వారా వచ్చే వేతనాలను 300టీసీఎస్ పద్దు కింద వస్తున్న వేతనాలతో సమానంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ పద్దు కింద నియామకాలు నిలిపివేసిందని సూపరింటెండెంట్ స్పష్టంచేశారు. సూపరింటెండెంట్‌తో జరిపిన చర్చలతో కార్మికులు శాంతించకుండా గతంలో మంజూరైన 35పోస్టుల్లో 19 మందిని నియమించారని, మిగతా 16 మందిని కూడా నియమించాలని డిమాండ్ చేస్తూ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు.

బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కల్లూరి పవన్



హన్మకొండ: భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కల్లూరి పవన్‌ను నియమించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంపీ బండి సంజయ్ ఆదేశాల మేరకు నియామక ఉత్తర్వులను బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్ జారీ చేశారు. ఈమేరకు నియామక పత్రాన్ని కల్లూరు పవన్‌కు హనుమకొండలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తీగల భరత్ గురువారం అందించారు.

సురేందర్‌కు అవార్డు ప్రదానం



కేయూ క్యాంపస్: వ్యాయామ విద్యలో ఉత్తమ సేవలు అందించినందుకు కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల అధ్యాపకుడు ఎడ్ల సురేందర్‌కు హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫిట్‌నెస్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవార్డు ప్రదానం చేశారు. దేశవ్యాపితంగా వ్యాయామ విద్యలో ఉత్తమసేవలు అందించిన వారికి అవార్డులను అసోసియేషన్ అందజేస్తోంది. తెలంగాణ నుంచి ఇద్దరు ఎంపిక కాగా, అందులో కాకతీయ యూనివర్సిటీ నుంచి సురేందర్ ఉన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ రాథోడ్, వైఎంసీఏ ప్రిన్సిపాల్ శ్యాంసన్ నుంచి అవార్డును సురేందర్ అందుకున్నారు.

మార్కెట్‌లో మిర్చి ధరలు

వరంగల్ రూరల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గురువారం వండర్ హాట్ మిర్చి క్వింటా ధర రూ.36వేలు పలికిందని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి బి.వి.రాహుల్ తెలిపారు. యూఎస్–341 రకం రూ.27,500, తేజ రూ.20,200, తేజ(కోల్డ్ స్టోరేజీ) రూ.19వేలు, తాలు మిర్చి క్వింటా ధర రూ.11వేలు పలికిందని, మొత్తం 1,130 బస్తాల మిర్చి విక్రయానికి వచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే పత్తి క్వింటా ధర రూ.8,155 పలికిందని, 2,911 బస్తాలు అమ్మకానికి వచ్చినట్లు ఆయన తెలిపారు.

'మేళా'తో అభ్యసన సామర్థ్యాల పెంపు



హసన్‌పర్తి: మాట్లాడుతున్న డీఈఓ అబ్దుల్‌హై



ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

హసన్‌పర్తి: విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించి, గుణాత్మక విద్యను అందించడానికి టీఎల్ఎం కృత్యమేళాలు ఎంతోగానో దోహదపడుతాయని హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్‌హై అన్నారు. హసన్‌పర్తి జిల్లా పరిషత్ పాఠశాలలో రెండురోజుల పాటు నిర్వహిస్తున్న మండలస్థాయి టీఎల్ఎం మేళా కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎల్ఎం తయారీ అనేది ఒక నైపుణ్యం అని తెలిపారు. తరగతి ప్రణాళిక అమలుకు టీఎల్ఎం అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల విధి అని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, నోడల్ ఆఫీసర్లు రాంరెడ్డి, కుమార్, ప్రధానోపాధ్యాయులు పద్మ, విజయలక్ష్మి, రమాదేవి, వెంకన్న, రంగనాథ్, శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.3.20 లక్షల విరాళం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం ఎల్లాపురం జిల్లా పరిషత్ పాఠశాలకు ఓ కుటుంబం రూ.3.20 లక్షల వ్యయంతో మౌలిక సదుపాయాలు సమకూర్చింది. పాఠశాలకు కావాల్సిన బెంచీలు, ఆట వస్తువులు, బ్లాక్‌బోర్డ్‌లను అందజేసింది. పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్‌హై మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి ముందుకు వచ్చిన 'గోలి' కుటుంబాన్ని అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారి రాంకిషన్‌రాజు, దాతలు గోలి కోదండ రాంరెడ్డి, గోలి సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు కేతిరి దామోదర్‌రెడ్డి, యాకుబ్‌పాషా, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

బోధన అభ్యసనం విద్యార్థికి చేరినప్పుడే తొలిమెట్టు విజయం

మడికొండ: బోధన అభ్యసన సామగ్రి తరగతిగదిలోని విద్యార్థి వద్దకు చేరినప్పుడే తొలిమెట్టు కార్యక్రమం విజయవంతమైనట్లని కాజీపేట మండల విద్యాశాఖాధికారి రామకిషన్ రాజు అన్నారు. గురువారం టీఎల్ఎస్ మేళా ముగింపు కార్యక్రమానికి ఎంఈఓ హాజరయ్యారు. నోడల్ అధికారి సంధ్యారాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేళాలో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులు జిల్లా స్థాయిలో ప్రదర్శిస్తారని తెలిపారు. జిల్లాస్థాయికి తెలుగు నుంచి ఏ.మల్లారెడ్డి, ఆర్ఎల్ మేరీ, ఇంగ్లిషు – కె.శోభారాణి, మన్నె చంద్రయ్య, గణితం – ఏ.మల్లారెడ్డి, జే.వీరప్రతాప్, ఈవీఎస్ – కె.రఘోత్తంరెడ్డి, వేదాంతాచారి, కన్సోలేషన్ – జే.అరుణ, ఎం.ధనలక్ష్మి ఎంపికైనట్లు ఎంఈఓ వివరించారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి రాధ, ఇందిర, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సందర్భంగా పోటీలు

హసన్‌పర్తి: సంక్రాంతి పర్వదినం సందర్భంగా గ్రామాల్లో పలు రకాలు పోటీలు నిర్వహిస్తున్న అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు మహిళలు, యువతులకు పోటీలు నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని అన్నాసాగరం, సీతంపేట, మడిపల్లి, జయగిరి, అర్వపల్లి, గంటూరుపల్లి, సూదన్‌పల్లి, సిద్ధాపురంలో గురువారం పోటీలు జరిగాయి. ముగ్గులు, చైర్, లెమన్ స్పూన్, స్కిప్పింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్‌లు జనగాని శరత్, బండా అమితారెడ్డి, ధనలక్ష్మి, చిర్ర సుమలత, రాణి, పెద్ది సుమలత, జెన్నయ్య, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సుభాష్, వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాశిబుగ్గలో ముగ్గుల పోటీలు

కాశిబుగ్గ: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని డీవైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో 19వ డివిజన్ కాశిబుగ్గ వివేకానందకాలనీలో మహిళలకు గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పరిమెళ్ల గోవర్ధన్ రాజు మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలు, పండుగల ప్రాధాన్యతను చాటి చెప్పేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కనుమరుగవుతున్న కళలను కాపాడుకోవాలని కోరారు. కాగా, మహిళలు ఉత్సాహంగా పాల్గొని అందమైన ముగ్గులు వేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు ప్రేమలత, శ్రీలత, సుజాత, జ్యోతి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి, తదితరులు

హన్మకొండ: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్–143 రాష్ట్ర ద్వితీయ మహాసభలు విజయవంతం కావాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆకాంక్షించారు. ఈనెల 8నుంచి జరగనున్న టీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను హనుమకొండలో మంత్రి దయాకర్‌రావుతో పాటు ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేష్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లం నారాయణ నాయకత్వంలో పురుడుపోసుకున్న తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం ఇంతింతై వటుడింతై అన్నట్లుగా పెద్ద సంఘంగా అవతరించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్.లెనిన్, హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మస్కపురి సుధాకర్, నాయకపు సుభాష్, వరంగల్ ప్రధాన కార్యదర్శి గుల్లపెల్లి ఉమెందర్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు పోగాకుల అశోక్, ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు బుడిగే శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి గోకారపు శ్యాం, కార్యవర్గ సభ్యుడు జనగాని ఆంజనేయులు, చిన్న పత్రికల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతిరూపం రాజేశ్వరరావు జీవితం



రాజేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: నీతి, నిజాయితీ, త్యాగానికి నిలువెత్తు నిదర్శనం అమరజీవి రాజేశ్వరరావు అని, ఆయన మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంలోని ఓంకార్ భవన్‌లో రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ చెన్నారావుపేట మండలం ముగ్దుంపురం గ్రామంలో జన్మించిన రాజేశ్వరరావు.. కష్టజీవుల హక్కుల కోసం పీడిత ప్రజల పక్షాన పోరాడారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ కంట్రోల్ కమిషన్ సభ్యులు నర్ర ప్రతాప్, రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దం నాగార్జున, నాగెల్లి కొమురయ్య, వంగల రాగసుధ, మాలి బాబురావు, జిల్లా కమిటీ సభ్యులు సుంచు జగదీశ్వర్, ఎండి.ఇస్మైల్, కలకోట్ల యాదగిరి, ఐతమ్ నాగేష్, దామ సాంబయ్య, కందికొండ కుమారస్వామి, గాజుల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అభినందన



అశోక్‌ను ప్రశంసిస్తున్న కలెక్టర్ గోపి

కరీమాబాద్: వరంగల్ ఉర్సు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పోగు అశోక్‌ను వరంగల్ కలెక్టర్ గోపి అభినందించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి విద్యాసదస్సుకు జిల్లా నుంచి ఎంపికైన అశోక్.. తన పరిశోధన పత్రాలు సమర్పించారు. వరుసగా నాలుగుసార్లు ఎంపికైన అశోక్.. జిల్లా నుంచి ఎంపికైన ఏకైక ఉపాధ్యాయుడు కావడం గమనార్హం. డీఈఓ వాసంతి, డీఎస్ఓ శ్రీనివాస్, ఏఎంఓ సారయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సౌత్‌జోన్ ఖోఖో టోర్నమెంట్‌కు కేడీసీ విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ

విద్యారణ్యపురి: కాకినాడలోని జేఎన్‌టీయూలో ఈనెల 9నుంచి 12వరకు నిర్వహించనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో (పురుషులు) టోర్నమెంట్‌కు హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు సిహెచ్.వెంకటేష్, కె.సిద్ధు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సోమన్న తెలిపారు. ఈమేరకు క్రీడాకారులను కళాశాలలో ప్రిన్సిపాల్, పీడీతో పాటు కళాశాల గేమ్స్ కమిటీ బాధ్యులు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజీవయ్య, వినోద్‌రావు, సోమనర్సయ్య, కమలాకర్, విజయపాల్‌రెడ్డి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ రమేష్ గురువారం అభినందించారు.

8న రవాణారంగ సంఘర్షణ యాత్ర



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాజీపేట రూరల్: జిల్లాలో ఈనెల 8న నిర్వహించనున్న ట్రాన్స్‌పోర్టు కార్మికుల రాష్ట్ర సంఘర్షణ యాత్రసభను జయప్రదం చేయాలని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె ప్రభాకర్ రెడ్డి, బొల్లారం సంపత్ పిలుపునిచ్చారు. ఈమేరకు కాజీపేట జంక్షన్ వద్ద వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, నూతన మోటార్ వాహన చట్టం 2019ను సవరించాలని, కోరిన చోట అడ్డాలు, స్థలాలు, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని, అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాజీపేట రైల్వేస్టేషన్ ఆటోస్టాండ్ ప్రతాపరుద్ర అధ్యక్షుడు గద్దం నరహరి, రాజు, పి.రవి, ఎ.చిరంజీవి, ఎం.కుమారస్వామి, లక్ష్మణ్, రమేష్, వేణు, శేఖర్, మేర్తి, దాసు పాల్గొన్నారు.

బీజేపీనుంచి బీఆర్ఎస్‌లో చేరిక



ఖిలా వరంగల్: కార్పొరేటర్ చింతాకుల అనిల్, సునీల్, బాలిన సురేష్ అధ్యక్షతన బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు క్రాంతి కుమార్, ఆయన అనుచరులు గురువారం తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. క్రాంతి కుమార్‌కి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కేయూ ఫార్మసీ పూర్వ విద్యార్థినులకు సన్మానం



సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, డీన్, తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఫార్మసీ కళాశాలలో ఇద్దరు పూర్వ విద్యార్థులను గురువారం సన్మానించారు. అమెరికాలో ఫైజర్ కంపెనీలో సీనియర్ సైంటిస్టుగా పనిచేస్తున్న ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థిని సుమన్‌శంకర్.. కేయూ ఫార్మసీ కళాశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి పరిశోధన అంశాలపై ప్రసంగించారు. అలాగే, మరో పూర్వ విద్యార్థిని పద్మశ్రీ.. ఫార్మసిస్టుగా, అలుమ్ని మెంబర్‌గా సేవలను అందిస్తున్నారు. కాగా, ఆ ఇరువురిని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, డీన్ ప్రొఫెసర్ నర్సింహారెడ్డి, అధ్యాపకులు డాక్టర్ కృష్ణవేణి, తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, డాక్టర్ ఉష, డాక్టర్ సునీత, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ సుజాత, డాక్టర్ భాగ్య పాల్గొన్నారు.

9న బీఎన్‌రెడ్డి శతజయంతి వార్షికోత్సవం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నయీంనగర్: కామ్రేడ్ భీమ్‌రెడ్డి నరసింహరెడ్డి శతజయంతి వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాస్ సావిత్రి పిలుపునిచ్చారు. ఈమేరకు ఉత్సవాల వాల్‌పోస్టర్లను హనుమకొండ కేయూ క్రాస్ జంక్షన్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 9న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తి – రాజకీయ సామాజిక అంశాలపై బి.ఎన్. ప్రభావం' అనే అంశంపై జరగనున్న సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు దామెర సుదర్శన్, కేసరి ఇంద్ర, సబిత, జయ, కల్పన, నిర్మల, సుజాత, మంజుల, రాజయ్య, రమేష్, సుధాకర్, శ్రీనివాస్, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

నట్లు, బొల్టులు బిగించారు



హసన్‌పర్తి: హసన్‌పర్తి పెద్ద చెరువు మధ్య తూము లాక్‌కు నట్లు, బొల్టులు బిగించారు. తూము లాక్‌కు ఉన్న నట్లు, బొల్టులను కొంతమంది వ్యక్తులు రెండు రోజుల క్రితం దొంగిలించారు. దీంతో నీరు వృథాగా పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు అధికారులు స్పందించి నట్లు, బొల్టులను తూము లాక్‌కు గురువారం బిగించారు. పనులను ఏఈ వేణు గోపాల్, కాంట్రాక్టర్ అంచూరి వజజీయ్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి పర్యవేక్షించారు.

సంక్షిప్తంగా

వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట



హసన్‌పర్తి: వైద్యానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కార్పొరేటర్ దివ్యారాణి అన్నారు. 65వ డివిజన్ చింతగట్టులో రూ.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న పీహెచ్‌సీ సబ్‌సెంటర్ పనులను కార్పొరేటర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్కార్ ఆస్పత్రిల్లో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని చెప్పారు. షుగర్, బీపీలకు సంబంధించిన మందులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాజునాయక్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఏరుకొండ శ్రీనివాస్, విద్యాకమిటీ చైర్మన్ మల్లేశం, రైతు బంధు సమితి కోఆర్డినేటర్లు నద్దునూరి నాగరాజు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన బస్ సర్వీసు ప్రారంభం

వరంగల్ చౌరస్తా: వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ లో నూతనంగా ఏర్పాటు చేసిన సూపర్ లగ్జరీ బస్ సర్వీసును వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.75 కోట్లతో నూతన బస్‌స్టేషన్ నిర్మించబోతున్నట్లు చెప్పారు.

పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ ధ్యేయం

ఖిలా వరంగల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని 37, 38 డివిజన్ల కార్పొరేటర్లు వేల్పుగొండ సువర్ణ, బైరబోయిన ఉమయాదవ్ తెలిపారు. వరంగల్ పడమర కోటలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ల ఆధ్వర్యంలో గురువారం అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బోగి సురేష్, బైరబోయిన దామోదర్ యాదవ్, టీచర్లు శోభ, స్వర్ణ, వాహేద, రాజమణి పాల్గొన్నారు.


కేయూలో ఇద్దరు పరిశోధకులకు డాక్టరేట్





కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరు పరిశోధకులకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఇన్వెస్టిగేషన్ ఆఫ్ వేవ్స్ వేరియస్ పోరోలాస్టిక్ లేయర్స్ హాల్స్ స్పేసెస్ అండ్ సాలిడ్స్ అనే అంశంపై ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి మ్యాథ్‌మెటిక్స్ విభాగం పరిశోధకురాలు పూనెం లతామాధురికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. అలాగే, తెలుగు విభాగంలో వీఆర్ విద్యార్థి కవిత్వం, విశ్లేషణ అనే అంశంపై డాక్టర్ యల్లంభట్ల నాగయ్య పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి పాశం యాదగిరికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు.

సాయిబాబా మందిరంలో ఉచిత కంటి పరీక్షలు



హన్మకొండ కల్చరల్: హనుమకొండ బస్టాండ్ రోడ్డులోని షిర్డి సాయిబాబా మందిరంలో గురువారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. మాక్స్ విజన్ హాస్పిటల్ సౌజన్యంతో ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్ పూస సురేష్‌కుమార్, ఆస్పత్రి సిబ్బంది సాయిగణేష్, హరీష్, శ్రీవిద్య.. భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్, ధర్మకర్తలు సదానందం, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన



కాజీపేట: సైబర్ నేరగాళ్లు రోజురోజుకు కొత్తపుంతలు తొక్కుతూ మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి సూచించారు. సైబర్ మోసాలపై కాజీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సెయింట్ ఆన్స్ నర్సింగ్ కళాశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై రవికుమార్, ప్రిన్సిపాల్ నవీన, జ్యోతి పాల్గొన్నారు.

ప్రైవేట్ సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

నయీంనగర్: ప్రైవేట్ సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని ఎంఆర్‌హెచ్‌పీఎస్ అధ్యక్షుడు చింత భాస్కర్ డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో భాస్కర్ మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయకపోవడంతో డిగ్రీ చదివిన దళిత యువతీ యువకులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సారం కట్టయ్య, కలకోట్ల ప్రభాకర్, శ్యాం, సంపత్, వినయ్, రవి తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వండి

వరంగల్ అర్బన్: నగరవ్యాప్తంగా తడి, పొడి చెత్త సేకరిస్తున్న 163మంది స్వచ్ఛ ఆటో ఓనర్ కమ్ డ్రైవర్లకు గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణికి కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావుతో కలిసి స్వచ్ఛ ఆటో ఓనర్ కమ్ డ్రైవర్లు గురువారం వినతిపత్రం అందజేశారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

భాషా నిలయంలో అగ్నిప్రమాదం

హన్మకొండ కల్చరల్: హనుమకొండ పింజర్ల వీధిలోని శ్రీరాజరాజ నరేంద్రాంధ్ర భాషా నిలయంలో అగ్నిప్రమాదం జరిగింది. అటెండర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు దంపతులు ఉండే గదిలో గురువారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో రిఫ్రిజిరేటర్‌లో నుంచి మంటలు రావడంతో వారి గదిలోని సుమారు రూ.70 వేల విలువైన టీవీ, వస్తు సామగ్రి, బట్టలు కాలిపోయాయి. భాషా నిలయం కార్యదర్శి కుందావజ్ఝల కృష్ణమూర్తి మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉన్న పుస్తకాల భద్రంగా ఉన్నాయని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో పలువురికి జరిమానా

కాజీపేట: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 11మందిని కోర్టులో గురువారం హాజరుపర్చగా ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష, మరో 10 మందికి రూ.15,400 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కె.విద్యాసాగర్ రావు తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు. సీఐ కథనం ప్రకారం కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలువురు ఎస్సైలతో కలిసి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా 11మంది మద్యం తాగినట్లుగా నిర్ధారణ అయింది. వారిని కోర్టులో హాజరుపర్చగా యాపలేకుల శివకృష్ణకు రెండు రోజుల జైలు విధించారు.

వరంగల్ క్రైం: హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరికి జైలుశిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా అర్మూర్‌కు చెందిన రాపాక వెంకటరమణ, ఎల్లపూర్‌కు చెందిన తాటికొండ రాంమోహన్‌కు రెండు రోజుల చొప్పున జైలుశిక్ష, అలాగే, మరో 9మందికి రూ.13,500 జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

పేకాట ఆడుతున్న ఐదుగురి అరెస్ట్

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలో ఈనెల 3న పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. సిబ్బందితో కలిసి ఎస్సై ప్రమోద్‌కుమార్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కొంతమంది పేకాట ఆడుతున్నట్లుగా అందిన సమాచారం మేరకు స్థావరంపై దాడి చేశారు. ఈమేరకు ఆరోగ్యరాజు, గులామ్ మహమ్మద్ షరీఫ్, సోమాని గోవిందు, ఐల రామకృష్ణ, పోరండ్ల సునీల్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ చెప్పారు. వారి నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ.17,150 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్

హసన్‌పర్తి: నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఈమేరకు వాహనదారులపై కేసు నమోదు చేశారు. కాకతీయ యూనివర్సిటీ పోలీసులు గురువారం తనిఖీలు చేపట్టి నిబంధనలు పాటించని ఐదు వాహనాలను సీజ్ చేసి వాహనదారులకు జరిమానా విధించినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు

రామన్నపేట: వాహనాల నంబర్ ప్లేట్లు ట్యాంపరింగ్ చేసిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఇంతెజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ తెలిపారు. పోచమ్మమైదాన్‌లో గురువారం వాహన తనిఖీలు నిర్వహించగా వాహన నంబర్లు ట్యాంపరింగ్ చేసిన ఆరుగొండ సాయికుమార్, పోసాని అభిరామ్, చిలువేరు భరత్, ఖగేష్‌పాషా, జూదూలాల్‌తో పాటు మరోవ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ జిల్లా బ్లాక్ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



సంపత్‌కు కేక్ తినిపిస్తున్న రాజేందర్ రెడ్డి

హన్మకొండ: కాంగ్రెస్ పార్టీ హనుమకొండ బ్లాక్ అధ్యక్షుడు బంక సంపత్‌యాదవ్ జన్మదిన వేడుకలను హనుమకొండ గోకుల్ కూడలిలోని ఓ ప్రైవేట్ బాంక్వెట్ హాల్‌లో గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి సమక్షంలో సంపత్‌యాదవ్ కేక్ కట్ చేశారు. వర్ధన్నపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాస్, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు బంక సరళయాదవ్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, నాయకులు బొమ్మతి విక్రమ్, కొత్తపల్లి శ్రీనివాస్, బొంత సారంగం, మాడిశెట్టి సతీష్, జాఫర్, పూర్ణ, కొండా నాగరాజు, సంగీత్, మనోహర్, పుల్లె రవికిరణ్, గాండ్ల స్రవంతి, దోపతి రవి, సుకన్య పాల్గొన్నారు.